క్లుప్తంగా

ఆధ్యాత్మిక ప్రవచనాలు



మాట్లాడుతున్న బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ శనివారం శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామిపై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కాలజ్ఞానాన్ని బోధించిన మహనీయుడు అని తెలిపారు. కాళికాంబ సప్తశతి, వీరకాళికాంబ శతకాల ద్వారా ప్రపంచానికి తత్వబోధన చేసిన జగద్గురువు వీరబ్రహ్మేంద్రస్వామి అని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడ ఏ వింత జరిగినా వీరబ్రహ్మేంద్రస్వామిని తలుచుకుంటారని పేర్కొన్నారు. కాలజ్ఞానంలో ఆయన చెప్పినవన్నీ జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆదివారంతో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ముగియనుంది.

డాక్టరేట్ ప్రదానం



బంగి బాలసుబ్బన్న

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగాధిపతి బంగి బాలసుబ్బన్నకు డెహ్రాడూన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన డిజైన్ అండ్ ఫర్ ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ ఆప్టికల్ డివైజెస్ అండ్ ఆప్టికల్ ఫైబర్ బేస్డ్ బయో సెన్సార్ అనే అంశంపై పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా బాలసుబ్బన్నను డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వైద్య శిబిరం



బీపీ పరీక్ష చేయించుకుంటున్న జడ్జి రమేష్ కుమార్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో డాక్టర్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి జీఎస్ రమేష్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి పాల్గొని బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం హోమియోపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీప్రసన్న, భాస్కర్‌రెడ్డి, హోమియో కేర్ మేనేజర్ మురళీమోహన్, హోమియో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట సీఐగా మోహన్



ఖాజీపేట : ఖాజీపేట సీఐగా మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ రామాంజులు కర్నూలు జిల్లా మంత్రాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మోహన్ ఇక్కడికి వచ్చారు. ఖాజీపేట స్టేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత వచ్చిన రెండవ సీఐ ఈయననే.

గుర్తింపులేని పాఠశాలపై చర్య తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో యూనివర్సల్ పాఠశాల పేరుతో అనుమతి లేకుండా, గుర్తింపులేని పాఠశాలను నడపటం చట్టవిరుద్ధమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి ఆరోపించారు. శనివారం ఆ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. యూనివర్సల్ పాఠశాల నర్సరీ నుండి పదవ తరగతి వరకు అధిక ఫీజులు వసూలు చేస్తూ తరగతులు నడుపుతున్నారని తెలిపారు. పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రవి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చారి, వంశీ, మధు, సంజయ్, నరసింహ, వినయ్, పండు, ఆంజనేయులు పాల్గొన్నారు.

టీ.సండ్రపల్లెలో పశువైద్య శిబిరం

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లెలో ఏపీ పశుసంవర్ధకశాఖ రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సౌజన్యంతో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ శిరీష, డాక్టర్ క్రిష్ణవేణి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 45 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 38 దూడలకు నట్టల నివారణ మందులు, 15 పశువులు, 72 మేకలకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి, సర్పంచ్ సరిత, పశువైద్య సిబ్బంది వెంకటేష్, రమేష్, లక్ష్మీనరసయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై వైద్యుల నిరసన

- మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు రావాలి
- మహిళా వైద్యురాలిపై అత్యాచార, హత్యను నిరసిస్తూ ప్రొద్దుటూరులో భారీ ర్యాలీ
- సంఘీభావంగా ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యసేవలు నిలిపివేత



ప్రొద్దుటూరు క్రైం : శివాలయం సెంటర్‌లో మాట్లాడుతున్న ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీజీ మహేష్



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన క్రూర మృగాలను నడిరోడ్డుపై ఉరి తీయాలని వైద్యులు డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు ఆగాలంటే దేశంలోనూ, రాష్ట్రంలో కఠినమైన చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ ప్రొద్దుటూరు ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ బిల్డింగ్ నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీజీ మహేష్ మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థిని గ్యాంగ్ రేప్ చేసి అత్యంత కర్కశంగా చంపేశారన్నారు. ఆమె చదువుతున్న కాలేజీలోనే ఈ ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. దేశంలో శాంతిభద్రతలు ఇంత దారుణంగా ఉన్నాయన్నారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ కోల్‌కతా ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని చోట్ల నిరసనలు జరుగుతున్నాయన్నారు. అత్యవసర కేసులు మినహా అన్ని రకాల వైద్య సేవలను నిలిపేసినట్లు తెలిపారు. ప్రొద్దుటూరులోని 100 హాస్పిటళ్ల వైద్యులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారని చెప్పారు.

■ డాక్టర్ పద్మలత మాట్లాడుతూ మహిళా పీజీ డాక్టర్‌పై జరిగిన ఈ ఘటన అత్యంత విచారకరమన్నారు. రాత్రి డ్యూటీ నిర్వహించే మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారికి ప్రత్యేక గదిని కేటాయించాలని కోరారు. ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల్ని కాపాడటానికి ఎవరూ ముందుకు రారని, మహిళలే అపరకాళీగా అవతారం ఎత్తాలన్నారు. గతంలో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన కంటే ఇది దారుణమైన సంఘటన అని డాక్టర్ తెలిపారు. ఏరోజైతే మహిళలపై దాడులు ఆగుతాయో ఆ రోజే మన దేశానికి పూర్తిగా స్వాతంత్య్రం వచ్చినట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు సాయిప్రసాద్, ధనిరెడ్డి నరసింహారెడ్డి, లక్ష్మీనరసయ్య, త్యాగరాజరెడ్డి, బుసిరెడ్డి, వరలక్ష్మి, ప్రమీలారంగారెడ్డి, సురేష్, నాగార్జున, శంకర్, జిలాని, నిరంజన్‌రెడ్డి, మెడికల్ రెప్, పిజియోథెరపీ, డెంటిస్టు అసోసియేషన్ సభ్యులు, ప్రైవేట్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీలో ..

మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కామనూరు, దొరసానిపల్లె, పెన్నానగర్‌లో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యులు హనీఫ్‌బాబా, శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణమ్మ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఫార్మసీ ఆఫీసర్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, స్టాఫ్‌నర్స్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో..

వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా జిల్లా ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలి ఘటనలో నిందితులను శిక్షించాలి

మైదుకూరు : కోల్‌కతాలో డాక్టర్‌ను అత్యాచారం చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మైదుకూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రి నుంచి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వరకు వారు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆస్పత్రికి చెందిన వైద్యులు నాగయ్య, జ్యోత్స్న, పవన్, గాయత్రి, శివ, సునీత, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మండల వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం : బి.మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. డాక్టర్ సంపత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్షుడు కలివెల చంద్రశేఖర్, మండల నాయకులు సోమిరెడ్డిపల్లె అరవింద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పశ్చిమబెంగాల్‌లో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం దేశంలోనే అత్యంత కిరాతకమైందని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. కల్‌కతా వైద్యకళాశాల విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనకు నిరసనగా శనివారం పోరుమామిళ్లలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు జయరామ్, నాగేంద్ర, రమణారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, శివకృష్ణ, కార్తీక్, అఖిల, లక్ష్మి, మృదుల పాల్గొన్నారు.

ప్రత్యేక రక్షణ చట్టాలు చేయాలి

బద్వేలు అర్బన్ : వైద్యులు, వైద్య సిబ్బందిపై జరిగే దాడులను, నేరాలను నియంత్రించేందుకు కేంద్ర స్థాయిలో ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బద్వేలుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, సెక్రటరీ డాక్టర్ వాసుదేవరెడ్డి, ట్రెజరర్ డాక్టర్ దినేష్‌లు పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో సత్వర న్యాయం డిమాండ్ చేస్తూ ఐఎంఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.గోపాలక్రిష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ రాంప్రతాప్‌రెడ్డి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరికిరణ్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ మహబూబ్‌పీర్, డాక్టర్ క్రిష్ణ, డాక్టర్ లక్ష్మినరసయ్య, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌జీవో అసోసియేషన్ సెక్రటరీ టి.నరసింహారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు గురుమూర్తి, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవ మృగాలను ఉరితీయాలి

ప్రొద్దుటూరు : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధులను ఉరితీయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ సంఘటనలో నిజాలను వెలికితీసి నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఈ రోజు డాక్టర్లందరూ విధులు మానేసి రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని అక్కడి ప్రభుత్వం కల్పించిందన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి సాల్మన్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో వైద్యసిబ్బంది నిరసన ర్యాలీ



బద్వేలు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ నాయకులు, వైద్యులు

పూర్వ విద్యార్థులు మార్గదర్శకులు కావాలి



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న సీబీఐటీ చైర్మన్ జయచంద్రారెడ్డి

చాపాడు : వివిధ విభాగాల్లో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు తాము చదువుకున్న కాలేజీలోని విద్యార్థులకు మార్గదర్శకులు కావాలని సీబీఐటీ చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం అలూమ్ని మీట్ పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ ఆవిర్భవించిన 2008 నుంచి వివిధ కోర్సులలో చదువులు పూర్తి చేసుకుని వివిధ కంపెనీలలో పని చేస్తున్న పూర్వపు విద్యార్థులందరూ తమ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పూర్వపు విద్యార్థులు తమకు వీలు ఉన్నప్పుడల్లా తమ కాలేజీకి వస్తూ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించాలని కోరారు. డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 16 ఏళ్ల కాలంలో సీబీఐటీ ఎన్నో అసాధారణ విజయాలు సాధించిందని, దీనికి కారకులైన విద్యార్థులందరూ కాలేజీ పేరు నిలబెట్టాలన్నారు. అటానమస్‌గా మారిన కాలేజీ త్వరలో యూనివర్సిటీగా మారుతోందన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని గొప్ప స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలలో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి, అలూమ్ని కో ఆర్డినేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ప్రశాంత జీవనం గడపాలి



చిన్నగురువళూరులో ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

చాపాడు : ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాలని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ అన్నారు. మండలంలోని చిన్నగురువళూరు, చిన్నవరదాయపల్లె, నక్కలదిన్నె, ఖాదర్‌పల్లె గ్రామాలలో శనివారం సాయంత్రం ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజ

బద్వేలు(అట్లూరు) : వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు రావాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో శనివారం బద్వేలు, గోపవరం, అట్లూరు, సిద్దవటం మండలాల వ్యవసాయ అధికారులతో పాటు రైతు సేవాకేంద్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు చంద్రమోహన్ రెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన ఓబుళపతి నరసింహులు అనే వ్యక్తి వద్ద నుంచి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని శనివారం సమాచారం రావడంతో ఆ వ్యక్తిని పట్టుకుని 17 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో పద్మవిభూషణ్ మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా శనివారం మెగా అభిమానులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీరవీంద్ర విద్యాసంస్థల అధినేత పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, స్కూల్ హెచ్‌ఎం ఖాదర్‌వల్లి మాట్లాడుతూ ప్రొద్దుటూరు చిరంజీవి అభిమానులు రక్తదానం, అన్నదానం వంటి సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు రామారావు, షరీఫ్, చంద్రధర్, హిమామ్, బాబురావు, నెట్ బాషా, రమేష్, షేక్ నాయక్, చెన్నా రవి పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీకి చెందిన కొండయ్యపై శనివారం ఆంధ్రప్రదేశ్ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల ఓబయ్య ఎంపీడీఓ కుళ్లాయమ్మకు ఫిర్యాదు చేశారు. తాను ఉపసర్పంచ్ అంటూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొండయ్య పెత్తనం చెలాయిస్తున్నారని బాల ఓబయ్య తెలిపారు. వాస్తవానికి కొండయ్య కోడలు రమాదేవి గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్నారని ప్రస్తుతం వార్డు మెంబర్ మాత్రమేనని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి రాకుండా, ఎస్సీ కులానికి చెందిన సర్పంచ్ విధులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆయన కోరారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశారు.

ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం



కొండపేట ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లను సన్మానిస్తున్న దృశ్యం

కలసపాడు : మండలంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా ఇండ్లపోలయ్య, వైస్‌చైర్మన్‌గా లక్ష్మీతిరుపతమ్మ ఎన్నికయ్యారు. ఇటీవల కొన్ని అనివార్య కారణాల వలన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. శనివారం మండలంలోని కొండపేట, పుల్లారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. కొండపేటలో మరోసారి ఎన్నికలు వాయిదా వేసేందుకు టీడీపీ నాయకులు విశ్వప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ ఎన్నికలను ఎంఈఓ మస్తాన్‌వలి, ఎంపీడీఓ మహబూబ్‌బీలు పర్యవేక్షించారు. ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డినారాయణరెడ్డి, వడ్డెపోగుజయన్న, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్‌గా రామయ్య ఏకగ్రీవం

బి.కోడూరు : మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాల, మేకవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. సగిలేరు గురుకుల పాఠశాల చైర్మన్‌గా అబ్బిగాండ్ల రామయ్య, మేకవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా పెద్దిరెడ్డి రమణారెడ్డి, వైస్‌చైర్మన్‌గా నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పంతాలతో ఆగిన పాఠశాల కమిటీ ఎన్నిక



ప్రజలకు సర్దిచెబుతున్న పోలీసులు

పోరుమామిళ్ల : మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న సిద్దనకిచ్చాయపల్లె ఎంపీపీ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక వాయిదా పడింది. పాఠశాలలో 13 మంది తల్లిదండ్రులుండగా అందులో ఏడుగురు ఒకవైపు, మిగతా ఆరుగురు మరోవైపు ఉన్నారు. అయితే గ్రామ సర్పంచ్ వెంకటసుబ్బయ్య వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి కావడంతో సిద్దన కిచ్చాయపల్లె విద్యాకమిటీ విషయంలో టీడీపీ జోక్యం చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఎంఈఓ, ఎంపీడీఓ, తహసీల్దారు ఎన్నిక నిర్వహించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దాంతో తిరిగి శనివారం ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సర్వశిక్షా అభియాన్ నుంచి విశ్వనాథరెడ్డి, రమణమూర్తి పరిశీలకులుగా వచ్చారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి తదితరులు అక్కడకు రాగా, టీడీపీ మండల నేతలు కూడా వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఒకదశలో ఓటు వేసేందుకు పాఠశాలలోకి వెళుతున్న కమిటీ సభ్యులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా సమస్యకు పరిష్కారం లభించలేదు. పెద్ద మనుషుల ద్వారా కూడా పరిష్కారం కాక పోవడంతో ఎన్నిక వాయిదా పడింది. కాగా, పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక విషయంలో అధికార టీడీపీ నేతలు వ్యవహరించిన తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామికి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా గజమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచి బారులు తీరారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అగస్త్యేశ్వరస్వామి, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, అమృతేశ్వరస్వామి ఆలయాలతోపాటు పలు ఆలయాల్లో శనేశ్వరునికి నువ్వులతో, నల్లని వస్త్రాలతో అర్చన చేసి ప్రదక్షిణలు చేశారు. పలు ఆలయాల్లో శనేశ్వరునికి పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు.

రేపు యజ్ఞోపవీతధారణ మహోత్సవం

స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు యజ్ఞోపవీతధారణ మహోత్సవం ఉంటుందని, యజ్ఞోపవీతాలను ఆలయంలోనే అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. లలితాదేవి, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు చేసి అలంకరించనున్నట్లు వారు పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు 108 మంది మహిళలతో సామూహికంగా లలితాదేవి అమ్మవారికి జాజిపూలతో సహస్రనామార్చన, రతనాల వెంకటేశ్వరస్వామికి కుంకుమతో సహస్రనామార్చన చేయనున్నట్లు తెలిపారు.

వెల్లాలలో భక్తుల సందడి

రాజుపాళెం : శ్రావణ మాసంలో రెండవ శనివారం కావడంతో మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను పల్లకిలో ఆశీనులు చేసి వైభవంగా ఊరేగించారు.

గోపాలస్వామి ఆలయంలో..

మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలోని మదన గోపాలస్వామి ఆలయంలో ఉన్న అభయాంజనేయస్వామికి శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలను అర్చకుడు విజయవర్ధనరావు చేశారు. భక్తులు మదనగోపాలస్వామి, అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సాక్షి యాడ్స్ రీజనల్ మేనేజర్ సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు

అట్లూరు : మండల పరిధిలోని బోడిశెట్టిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. గ్రామంలో దాతల సహకారంతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. గత మూడు రోజులుగా ఆలయంలో సీతారామలక్ష్మణ మూలవిరాట్ విగ్రహ ప్రతిష్ఠ చేయడంతో పాటు వేదపండితులచే పలు కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన శనివారం సీతారాముల ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి సాక్షి యాడ్స్ రీజనల్ మేనేజర్ దున్నూతల సుబ్బారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సీతారాములకు భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం విగ్రహమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దున్నూతల శ్రీనివాసులరెడ్డి, పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, పొన్నపోలు సాంబశివారెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, సూరావీరారెడ్డి పాల్గొన్నారు.

గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అట్లూరు : శ్రావణమాస రెండో శనివారం శ్రీ కొండ గోపాలస్వామి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.